# మహిళా పార్లమెంట్ సదస్సు-అమరావతి డిక్లరేషన్

## ఆంధ్రప్రదేశ్ శాసనసభ అభినందన తీర్మానం

మహిళా సాధికారత దిశగా ఇటీవల శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు రెండూ కలిసి 'అమరావతి డిక్లరేషన్'చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ అభినందిస్తోంది. ఇది ఒక సత్‌సంకల్పంగా, మహిళా సాధికారతకు జరిగిన పట్టాభిషేకంగా సభ భావిస్తోంది.

'దశ' అంశాలతో కూడిన ఈ డిక్లరేషన్ ఈ రాష్ట్రంలో మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ దశను మార్చే తీర్మానంగా శాసనసభ అభిప్రాయపడుతోంది. స్త్రీ విద్య, చట్టబద్ధ హక్కులు, ఆరోగ్యం-పోషకాహారం, పారిశ్రామికవేత్తగా మహిళ, పరిశోధన-నవ్యావిష్కారాలు, మహిళలు-రాజకీయాలు, సాంఘిక భద్రత, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, సాంఘికాభివృద్ధి, మహిళలు-డిజిటల్ లిటరసీ అనే పది అంశాలతో 'అమరావతి డిక్లరేషన్' చేయడాన్ని నవ్యాంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక మేలిమలుపుగా అభివర్ణిస్తోంది.

భవిష్యత్తులో మహిళలు అన్నిరంగాల్లో సమానావకాశాలు అందుకునేందుకు 'అమరావతి డిక్లరేషన్' స్ఫూర్తిగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కోరుకుంటోంది. మహిళలు పురుషులతో సమానంగా హక్కులు పొందిన చోటే సామాజికాభివృద్ధి సాధ్యం.

ఒక జాతి నిర్మాణం సక్రమంగా జరగాలంటే మహిళా సాధికారత అత్యంత అవసరం. స్త్రీలను గౌరవించే సంప్రదాయం మన తెలుగుజాతిలో ఉంది. అమరావతిని రాజధానిగా సువిశాల సామ్రాజ్యాన్ని విస్తరించిన ఆంధ్ర పాలకులు 'శాతవాహనులు' తమ మాతృమూర్తుల పేర్లను తమ పేర్లకు ముందు ధరించి ప్రాచుర్యం పొందిన విషయాన్ని ఈ సభ మననం చేసుకుంటోంది.

మహత్తర చరిత్ర కలిగిన అమరావతి గడ్డమీద ఈ ఏడాది ఫిబ్రవరి 10, 11, 12 తేదీలలో మహిళా పార్లమెంటు సదస్సు ఘనంగా జరపడమే చారిత్రాత్మకం. గోదావరి, కృష్ణమ్మ కలసిన పవిత్రసంగమ ప్రదేశం ఈ అపురూప ఘట్టానికి వేదికగా నిలవడం మనందరికీ గర్వకారణంగా శాసనసభ భావిస్తోంది. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఈ శాసనసభ నిర్వహించిన మహిళా పార్లమెంట్ ఓ స్ఫూర్తిదాయక కార్యక్రమం. సభా నిర్వహణను భుజస్కంధాలపై వేసుకున్న సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావును శాసనసభ మనస్ఫూర్తిగా అభినందిస్తోంది. సదస్సు విజయవంతం కావడానికి అన్ని విధాలా సహకారం అందించిన అధికారగణానికి, ఐక్యరాజ్య సమితి మహిళావిభాగానికి, MIT, పూణే నిర్వాహకులకు శాసనసభ కృతజ్ఞతలు ప్రకటిస్తోంది.

మహిళలు దేశానికి మార్గనిర్దేశనం చేసే స్థాయికి ఎదిగేందుకు 'అమరావతి డిక్లరేషన్' తోడ్పడుతుందని శాసనసభ ఆశిస్తోంది. ఇంటి నుంచే నిర్ణయాధికారం కావాలి. మహిళా సాధికారతకు సిసలైన అర్థం మహిళ మానవ హోదాకు, స్వేచ్ఛకు గౌరవాన్ని ఆపాదించడమే అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ అభిప్రాయపడుతోంది.